వినతులపై వెంటనే స్పందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 120 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ప్రజల నుంచి అందిన వినతులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి కలెక్టర్ స్వయంగా వినతులు స్వీకరించారు. భూ సంబంధ, వ్యక్తిగత, తదితర సమస్యలపై మొత్తం 120 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిని పరిష్కరించాలని సూచిస్తూ సంబంధిత అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ లో పొందుపర్చాలన్నారు. వాటి పరిష్కారం, అధికారులు తీసుకున్న చర్యలపై తదుపరి సమీక్షిస్తామన్నారు. జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీవో సురేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వసతిగృహం భవనాన్ని మార్చాలి..

● హాస్టల్ విద్యార్థుల పేరెంట్స్ కమిటీ, బీబీపేట



అరకొర గదులు, వసతులతో నడిపిస్తున్న గురుకుల వసతిగృహం భవనాన్ని మార్చాలని కోరుతూ బీబీపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల హాస్టల్ విద్యార్థుల పేరెంట్స్ కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 250 సామర్థ్యం ఉన్న ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని 430 మంది విద్యార్థులతో హాస్టల్ నిర్వహిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గదుల కొరత కారణంగా చదువుకునే గదుల్లోనే పడుకుంటున్నాన్నారు. బాత్రూంలు, మరుగుదొడ్లు, ఇతర వసతులు సరిపడా లేవన్నారు. అన్ని వసతులతో కూడిన మరో భవనంలోకి గురుకులాన్ని మార్చాలని కోరారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

సౌకర్యాలు కల్పించాలి..

● ధరణి టౌన్‌షిప్ ఇళ్లు, ప్లాట్ల కొనుగోలుదారులు



ధరణి టౌన్‌షిప్‌లో సౌకర్యాలు కల్పించాలని ఇళ్లు, ప్లాట్ల కొనుగోలుదారులు కోరారు. సోమవారం వారు ప్రజావాణికి తరలి వచ్చారు. వారు మాట్లాడుతూ రామారెడ్డి రోడ్డులో ధరణి టౌన్‌షిప్‌లో ప్లాట్లను, ఇళ్లను ఇండ్లను కొనుగోలు చేశామన్నారు. ఏడాది దాటినా టౌన్‌షిప్‌లో కనీస వసతులు లేవన్నారు. రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్, తాగునీరు, ఇతర వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయని వాపోయారు.

కార్మిక చట్టాలను రక్షించుకోవాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కామారెడ్డి టౌన్ : కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సెప్టెంబర్ 23న బ్లాక్ డేగా చేపట్టాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 2019లో వేతనాల కోడ్, 2020లో ఐఆర్ కోడ్, ఓఎస్‌హెచ్ కోడ్, సామాజిక భద్రత కోడ్ ఇలా నాలుగు లేబర్ కోడ్‌లను బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించి కార్మిక లోకానికి అన్యాయం చేసిందన్నారు. నాయకులు అరుణ్‌కుమార్, మోహన్, నర్సింలు, ఇంద్రకుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

బిచ్కుంద(జుక్కల్) : పెండింగ్‌లో ఉన్న జీపీ పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ సోమవారం బిచ్కుందలో సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సురేష్ గొండ మాట్లాడుతూ ఒక్కో జీపీలో 5 నుంచి 10 నెలల నుంచి పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం కార్మికులకు దసర పండగ బోనస్ ఇవ్వాలని, కార్మికుడికి కనీసం రూ.26 వేల వేతనమివ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు రూప్‌సింగ్, సాయిలు, శంకర్, లింగురాం పాల్గొన్నారు.

ఎన్నికల్లో బంజారాలకు ప్రాధాన్యత కల్పించాలి


మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

రాజంపేట : స్థానిక ఎన్నికల్లో బంజారాలకు స్థానం కల్పించాలని ఆదివాసి చైర్మన్ బెల్లయ్య నాయక్ కోరారు. సోమవారం గాంధీభవన్‌లో ఆదివాసి కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. 33 జిల్లాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ బంజారాలకు రాజకీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాణా ప్రతాప్, ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు మదన్ లాల్ తదితరులున్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కమిటీ సభ్యులు

కామారెడ్డి టౌన్ : బీబీపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర రెసిడెన్షియల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ అద్దె భవనంలో కొనసాగుతూ సౌకర్యాలు లేవన్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, బాత్‌రూంలు అధ్వానంగా ఉన్నాయన్నారు. 250 మంది కెపాసిటీ భవనంలో 450 మంది విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు కరుణ, లావణ్య, సోని, సుజాత, భారతి, రాజు, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


హాజరైన అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించుటకు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కాన్ఫరెన్స్ ద్వారా సూచించించారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, ఎంపీవో సురేందర్ రెడ్డి, ఆరోగ్య శాఖ సీహెచ్‌వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సంఘ్ గ్రామ కార్యవర్గాల ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ధర్మారావ్ పేట్‌లో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మామిడి అనిల్, ఉపాధ్యక్షులుగా సామల మధుసూదన్ రెడ్డి, కార్యదర్శిగా గరిడి రాజేశ్వర్ రావు, సహ కార్యదర్శిగా మామిడి భాస్కర్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు ఒంటరి నాగరాజు తదితరులున్నారు. మండలంలోని మోడెగాం గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వలకొండ రఘుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గురుడు సాగర్ రెడ్డి, కార్యదర్శిగా జూకంటి రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, లక్ష్మారెడ్డి, డీసీ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లపై రైతులకు అవగాహన



బాన్సువాడ : విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బాన్సువాడలో సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ నాందేవ్ మాట్లాడుతూ రైతులందరు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి మోటార్‌కు కెపాసిటర్స్ బిగించుకోవాలన్నారు. ఆటో స్టాటర్లు తొలగించాలని, తెగిపడిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దన్నారు. రైతులు వెంకట్రావ్, సాయిలు, దత్తు, శివ, విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



బాన్సువాడ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ 2024 వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎల్లయ్య చెరువు కట్టపై మొ క్కలను నాటారు. ఏక్ పేడ్ మా కే నామ్ అనే నినాదంతో మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను కాపాడుకోవాలని సూచించారు. నాయకులు నార్ల ఉదయ్, మల్లికార్జున్, భాస్కర్ తదితరులున్నారు.

నాగన్నగారి బావి పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని నాగన్నగారి బావిని రాష్ట్ర ఆర్య వైశ్య ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. చారిత్రక కట్టడాలు మన పూర్వ సంస్కృతి సాంప్రదాయాలను గుర్తు చేస్తాయన్నారు. ఆర్య వైశ్య సంఘం సభ్యులు రమేశ్‌గుప్తా, సుధాకర్, నరహరి, భాస్కర్, అనిల్, తదితరులున్నారు.

కూలిన రోడ్డుతో పొంచి ఉన్న ప్రమాదం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ఉత్తునూర్ శివారులో ప్రధాన రహదారి అయిన బీటీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోడ్డు గుండా నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా సాగిస్తుంటారు. ఈ రోడ్డు కోతకు గురి కావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



బాన్సువాడ : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షులు సాయిలు అన్నారు. సోమవారం బాన్సువాడలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను ఇవ్వాలని, దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో దివ్యాంగులు కిష్టయ్య, రాములు, గంగాధర్‌యాదవ్, సాయిలు తదితరులున్నారు.

పూజలందుకుంటున్న బాలాజీ జెండా



మద్నూర్(జుక్కల్) : మండలంలో బాలాజీ జెండా నిత్యం పూజలందుకుంటోంది. నాలుగు రోజుల క్రితం తిరుపతి శ్రీవారి దగ్గరి నుంచి మద్నూర్ మండల కేంద్రంలో కొలువుదిరిన బాలాజీ జెండాకు భక్తులు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మరో వారంరోజుల్లో శ్రీవారి బాలాజీ జెండా తిరుపతికి బయలుదేరుతుందని జెండా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పలువురికి టీఎన్‌జీవోస్ సభ్యత్వం



కామారెడ్డి అర్బన్ : జిల్లాలోని స్టేట్ అడిట్‌శాఖ, విద్యాశాఖలకు చెందిన సిబ్బందికి సోమవారం సంఘ సభ్యత్వం అందజేసినట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజు, ప్రతినిధులు దేవరాజు, రాజేశ్వర్ తదితరులున్నారు.

అర్హత కలిగిన సభ్యులను సంఘంలో చేర్చుకోవాలి



రాజంపేట : అర్హత కలిగిన నూతన సభ్యులను సంఘంలో చేర్చుకోవాలని డీపీఎం సుధాకర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలకి బ్యాంకు లింకేజీ ఇప్పించాలని తెలిపారు. ఆర్థికాభివృద్ధి చెందాలనుకునే వాళ్లకు గేదెలను ఇప్పించాలని, సోలార్ యూనిట్ మోటివేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య కార్యదర్శి లావణ్య, ఏపీఎం సాయిలు, గ్రామ సంఘం అధ్యక్షులు వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : నేల కొరిగిన వరి పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ పరిశీలించారు. మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్, పోతాయిపల్లిలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి వరి పంట లు నేల వాలాయి. 29 మంది రైతులకు చెందిన 42 ఎకరాల్లో వరి పంటలు నేల కొరిగినట్లు ఏవో వెల్లడించారు. వివరాలు జిల్లా అధికారులకు పంపుతామన్నారు. ఏఈవో రాకేష్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



లింగంపేట(ఎల్లారెడ్డి) : యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం లింగంపేట మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, మత్తు పదార్థాలను వినియోగించవద్దని కళాకారులు ఆటపాటలతో వివరించారు. కళాకారులు లక్ష్మీనారాయణ, దేవన్న, మహేందర్ తదితరులున్నారు.

కాలనీల్లో 'స్వచ్ఛతా హీ సేవ'



కామారెడ్డి టౌన్ : ప్రధాని మోదీ బర్త్‌డే సందర్భంగా సేవ మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. రుక్మిణికుంట కాలనీలోని మైసమ్మ ఆలయం ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్త చెదారం తొలగించి శుభ్రం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విపుల్‌జైన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్ నరేందర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహిమొద్దీన్ మాట్లాడుతూ ఈ ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు హాజరయ్యాయన్నారు.

నేడు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు రాక



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగే పోషణ్ అభియాన్ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరువుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ తెలిపా రు. నిజాంసాగర్,పిట్లం ,మహమ్మద్ నగర్ మండలాల్లోని గర్భిణులు హాజరుకావాలన్నారు.

పీసీసీ చీఫ్‌కు సన్మానం



రామారెడ్డి : హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం ఇసన్నపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి సన్మానించి కాలభైరవ స్వామి చిత్రపాఠాన్ని అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించి కాలభైరవుడి దర్శనం కోసం రావాలని ఆహ్వానించినట్లు కాంగ్రెస్ నాయకుడు కందూరి లింబాద్రి తెలిపారు. నాయకులు దోమకొండ భైరు, కందూరి లింబాద్రి, చింతల రవీందర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిశారు. మండల కేంద్రంలోని బీటీ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిందని వెంటనే బీటీ రోడ్డును నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, మాజీ ఎంపీటీసీ బీరయ్య తదితరులున్నారు.

'మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు'



కామారెడ్డి అర్బన్ : యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా, మొబైల్ ఫోన్లలో సోషల్ మీడియాకు బానిస కాకుండా దృఢసంకల్పంతో మనసుపై నియంత్రణ సాధించాలని ఇంపాక్ట్ ట్రైనర్, స్పీకర్ రమేష్ చైతన్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ 'నషా ముక్త్ భారత్' రాష్ట్ర ప్రభుత్వ 'మాదక ద్రవ్యరహిత తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాల, వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. బాధితుల పేర్లు రహస్యంగా ఉంచి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వీవోఏల రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘాలలో లేని సభ్యులను సంఘాలలో చేర్పించడం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, కార్యదర్శి ఇందిర, సీసీలు తదితరులున్నారు.

పలువురికి పరామర్శ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం పరామర్శించారు. మండలంలోని వెల్లుట్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఫహీమ్, కొక్కొండలో మృతి చెందిన మల్లయ్య కుటుంబాలను సురేందర్ పరామర్శించారు. జలందర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్తం

ఎల్ఐసీ పథకాలపై గ్రామాల్లో ప్రచారం

కామారెడ్డి అర్బన్ : భారతీయ జీవిత బీమా పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించడానికి జిల్లాలోని వివిధ గ్రామాల్లో సంచార వాహనంపై ప్రచారం చేస్తున్నట్లు ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఎబీఎం హిమన్ష్ చౌహన్ తెలిపారు. సోమవారం తాడ్వాయి, ఏర్రపహాడ్, లింగంపేట, పర్మల్ల, సజ్జన్‌పల్లి, ఎక్కపల్లి, శెట్‌పల్లి సంగారెడ్డి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించామన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లిలో సోమవారం సూర్య ఆరోగ్య సంస్థ నిజామాబాద్, ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ, వైద్య ఆరోగ్య సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. పీహెచ్‌సీ వైద్యురాలు అస్మా ఆధ్వర్యంలో 158 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజేంద్ర విక్రమ్ తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పొల్కంపేటలోని జీపీ ఆవరణలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించినట్లు కార్యదర్శి అశ్వక్ తెలిపారు. బాచుపల్లికి చెందిన మమత ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మమత ఆసుపత్రి వైద్య సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తం అందించిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్

కామారెడ్డి అర్బన్ : మాచారెడ్డికి చెందిన కల్వకుంట రాజేశ్వరర్‌రావు అనే వృద్ధుడికి అత్యవసరంగా రెండు యూనిట్ల ఏ పాజిటివ్ రక్తం అవసరం కాగా హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తం ఇప్పించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. రాజేశ్వర్‌రావు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా తమను సంప్రదించగా చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ నుంచిఇప్పించామన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్‌లో బ్రెయిన్ సర్జరీ అయిన యువకుడు చరణ్‌కు మాజీ మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ సోమవారం ఆర్థికసాయం అందించారు. ఇటీవల సర్జరీ చేసుకున్న యువకుడికి పరామర్శించిన అనంతరం అతడికి సాయమందించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులున్నారు.

ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : బదిలీ అయిన ఎస్‌జీటీలను ప్రభుత్వం రిలీవ్ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాల్సి ఉండగా ప్రభుత్వం కొత్తగా 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న చోట ఇద్దరిని నియమించాలనేది సరికాదన్నారు.

సన్మానం

బాన్సువాడ : బీర్కూర్‌కు చెందిన కీర్తి రాజు ఎస్సైగా శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి రావడంతో ఆయన చదివిన పాఠశాల యాజమాన్యం ఎస్సైని సాయిపబ్లిక్ స్కూల్ యజమాన్యం, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. 2023లో జరిగిన ఎస్సై రాత పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన రాజు తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాడు. కార్యక్రమంలో రాజు స్నేహితులు చందు, యామ రాములు, బండ సాయిలు, క్యాకప్ప తదితరులున్నారు.